క్లుప్తంగా

శేష వాహనంపై శివయ్య



ద్వారకాతిరుమల : క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం శివదేవునికి ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ముందుగా సిబ్బంది ఆలయాన్ని, పరిసరాలను సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ గర్భాలయంలో కొలువైన శివదేవునికి రుద్రాభిషేకాన్ని జరిపి, హారతులిచ్చారు. సాయంత్రం గంగా, పార్వతీ సమేత శివదేవుడు శేష వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు.

మద్ది అంజన్నకు పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామికి మంగళవారం ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. 800 మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. స్వామివారికి ఆదాయం రూ: 1,06,946 వచ్చినట్లు చెప్పారు.

బీజేపీని గద్దె దించాలి

ద్వారకాతిరుమల : అత్యంత సంపన్నుల కోసం దేశాన్ని, దేశ ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్న బీజేపీని గద్దె దించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.లింగరాజు అన్నారు. సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో చేపట్టిన రాజకీయ ప్రచార భేరి యాత్ర మంగళవారం ద్వారకాతిరుమల, తిమ్మాపురం, పంగిడిగూడెం, గొల్లగూడెం, ఎం.నాగులపల్లి గ్రామాల్లో పర్యటించింది.

వేలేరుపాడు : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజల పై ఎనలేని భారం మోపుతోందని రాష్ట్ర సీపీఐ కార్యదర్శివర్గసభ్యులు ఎండీ మునీర్ మండిపడ్డారు. సీపీఐ, సీపీఎం ఆల్ఇండియా కమిటీల పిలుపు మేరకు ప్రజాపోరు యాత్రలో భాగంగా మంగళవారం వేలేరుపాడు మండలంలోని కొయిదా, కాచారం, టేకూరు, చిగురుమామిడి, బోళ్లపల్లి, కొత్తూరు, నార్లవరం, పడమటిమెట్ట, కన్నాయిగుట్ట, కొర్రాజులగూడెం, చాగరపల్లి, తెల్లిపల్లి, చెరువుగొల్లగూడెం, బర్రితోగు, జిన్నెలగూడెం, మల్లారం గ్రామాల్లో ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు,

తాగునీటి సమస్య ఉండకూడదు

చింతలపూడి : మండలంలో వేసవి దృష్ట్యా విద్యుత్ కొరత, తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బి.రాంబాబు నాయక్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. యర్రగుంటపల్లి గ్రామంలో వీఓ 2 పరిధిలో గ్రామసంఘం నిధులు దుర్వినియోగం అయ్యాయని సుమారు మూడేళ్ల నుంచి డ్వాక్రా గ్రూపులకు ఎలాంటి రుణాలు ఇవ్వడం లేదని ఎంపీటీసీ విజయకుమార్ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఏపీఎం జ్యోతి మాట్లాడుతూ గ్రామంలో ఒక వీఓ పరిధిలో సుమారు రూ.14 లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయని ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ జరుపుతున్నామని చెప్పారు. దుర్వినియోగం అయిన నిధులు రికవరీ అయ్యాకే సదరు సంఘాలకు కొత్త రుణాలు ఇవ్వడం సాధ్యపడుతుందని తెలిపారు. గృహనిర్మాణ శాఖ, తాగునీరు, రహదారులు తదితర అంశాలపై సభలో వాడీవేడిగా చర్చ జరిగింది.

రైతులతో గ్రామసభ

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు భూసేకరణలో భాగంగా భూమి కోల్పోయిన రైతులతో మంగళవారం వీఆర్వోలు గ్రామసభలు నిర్వహించారు. పోలవరం మండలంలోని ప్రాజెక్టు ముంపు గ్రామాలైన రామయ్యపేట, పైడిపాక, ప్రగడపల్లి పంచాయతీల పరిధిలో గిరిజనేతర రైతులతో వీఆర్వోలు సమావేశం నిర్వహించి, భూములు కోల్పోయిన రైతుల వివరాలను తెలియజేశారు. అలాగే సదరు రైతులకు సంబంధించిన ఆధార్, బ్యాంకు అకౌంట్ తదితర వివరాలను సమర్పించాలన్నారు. అప్పట్లో భూములు సేకరించిన సమయంలో తక్కువ నష్టపరిహారం ఇచ్చారని, రైతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేయగా, ఎకరానికి రూ.5లక్షల వరకు నష్టపరిహారం ఇస్తామని అప్పట్లో హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్పెషల్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ గ్రామసభలు నిర్వహించి, రైతుల వివరాలు సేకరిస్తున్నట్లు వీఆర్వోలు పేర్కొన్నారు.

కోర్టు హాజరుపట్టీలో సంతకాలు పెట్టమన్నాం

బుట్టాయగూడెం : తాను భూ వివాదాలకు సంబంధించి కోర్టు నిర్వహించిన సమయంలో కోర్టుకు హాజరైన వారు హాజరుపట్టీలో సంతకాలు పెట్టడం తప్పనిసరి అని బుట్టాయగూడెం తహసీల్దార్ ఎస్.శారా శాంతి అన్నారు. తన విధులకు ఆటంకం కలిగిస్తూ బెదిరింపులకు పాల్పడినట్లు తాను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై దువ్వెల సృజన అనే మహిళ తనపై ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ వివరణ ఇచ్చారు. రేగులకుంట గ్రామంలో బుట్టాయగూడెం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 1457లో ఒకే కుటుంబానికి చెందిన వారి మధ్య వివాదం ఏర్పడిందని అన్నారు. ఆర్‌డీఓ ఈ భూ వివాదంపై కోర్టు నిర్వహించాలని ఆదేశించడంతో ఇరు వర్గాలను పిలిపించి కోర్టు నిర్వహిస్తుండగా దువ్వెల సృజన లోపలికి ప్రవేశించి పెద్దగా అరుస్తూ విధులకు ఆటంకం కలిగించిందని చెప్పారు. అంతేకాకుండా కోర్టుకు హాజరైన వారిని పుస్తకంలో సంతకాలు కూడా పెట్టనివ్వకుండా తీసుకువెళ్లిందని చెప్పారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు



కుమ్మరిగట్టులో కుండల పనులకు సాయం చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



బోయగూడెంలో సమస్యలపై ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడుతున్న ఎలీజా

చింతలపూడి : జగనన్న పాలనలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని బోయగూడెంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా సచివాలయ వ్యవస్థద్వారా ప్రభుత్వం నుంచి అన్ని పథకాలు నేరుగా అందుతున్నాయని గ్రామస్తులు ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం పలువురు గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని అన్ని రోడ్లు అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎలీజా గ్రామస్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎస్.దుర్గారావు, మండల వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ వెంపా కృష్ణ, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మిరాయాల దిలీప్, జైపాల్, వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ ఎ.సుబ్బారావు, సర్పంచ్‌లు తాండ్ర రామకృష్ణారావు, కె.యువరాజు, ఎస్.వరలక్ష్మి, సీహెచ్ జ్ఞానారెడ్డి, కె.రామారావు, నగర పంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ కాంతులు

బుట్టాయగూడెం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో ఇంటింటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మణుడుగూడెం సచివాలయ పరిధిలోని కుమ్మరిగట్టులో మంగళవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌లను అతికించారు. అలాగే కుండ తయారీ చక్రాన్ని తిప్పి కుండలు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సర్పంచ్‌లు మడకం రామలక్ష్మి, ఉపసర్పంచ్ రేపాకుల చంద్రం, ఎంపీటీసీలు చారపు సుజాత, సవలం కోటేశ్వరరావు, నాయకులు కలగర నాని, చింతపల్లి వెంకటేశ్వరరావు, కారం వెంకట రమణ, అనుపోజు మురళి, తెల్లం దుర్గారావు, మండల సచివాలయ కన్వీనర్ తెల్లం సింహాచలం, ఎంపీడీవో ఎం.శ్రీహరి, ఎస్సై ఎం.జయబాబు, వెలుగు ఏపీఎమ్ పద్మావతి, ఎంఈఓ బాబూరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ అలీ, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



సంతమార్కెట్ సీసీ రోడ్డును ఎంపీటీసీలు నాగ సూర్యకళ, రమ్యకుసుమచే ప్రారంభిస్తున్న తలారి

ద్వారకాతిరుమల : రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా.. అభివృద్ధే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమలలో మంగళవారం నిర్వహించిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత శివాలయం ఘాట్ రోడ్డులో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన మంచినీటి బోరును ప్రారంభించిన ఆయన, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సంతమార్కెట్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎంపీటీసీలు రుద్ర నాగ సూర్యకళ, పెద్దిరెడ్డి రమ్య కుసుమల చేతుల మీదుగా ఎమ్మెల్యే ప్రారంభింపజేశారు. ఆ తర్వాత పసరుకోనేరు వద్ద పంచాయతీ నిధులు రూ.90 వేలతో పునరుద్ధరించిన వాటర్ ప్లాంట్‌ను, అక్కడ దేవస్థానం మండపంలో పంచాయతీ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ కుంటం స్వర్ణలత, బొండాడ వెంకన్నబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉక్కుర్తి వెంకట్రావు, అంబటి గాంధి, రుద్ర శివాజీ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, చిలుకూరి చంద్రం, పెద్దిరెడ్డి జ్యోతి, యిమ్మడి నాగు, దూలపల్లి ప్రసాద్, చిలుకూరి నాగ సుబ్రహ్మణ్యం, బొండాడ సాత్యకిరావు, తేలు వెంకటేశ్వరరావు, కొల్లి సుబ్బారావు, అచ్యుత ఏసుబాబు, పెద్దింటి కిరణ్, మానుకొండ సుబ్బారావు, జేవీ కృష్ణారెడ్డి, గుర్రాల లక్ష్మణ్, బాలం వెంకటేశ్వరరావు, మానుకొండ కన్నయ్య, కేవీఆర్, మానుకొండ భీమయ్య, దాకారపు అగ్గియ్య తదితరులున్నారు.

పీఏసీఎస్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొయ్యలగూడెం : బయ్యనగూడెం వ్యవసాయ సహకార పరపతి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కోరుకొండ బాపిరాజు పేర్కొన్నారు. బయ్యనగూడెం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీలోని సభ్యులైన కొప్పుల వెంకటేశ్వరరావు, నెరుసు సుజాతలతో కలిసి ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమం సంఘ కార్యదర్శి కె.శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పీఏసీఎస్ రూ.14 కోట్లు టర్నోవర్‌తో రైతులకు సేవలు అందిస్తోందని అదేవిధంగా గోల్డ్ లోన్, మూడుకోట్ల డిపాజిట్లు కలవని అన్నారు. ఇప్పటివరకు కమిటీ చైర్మన్‌గా విధులు నిర్వహించిన తోట జయబాబు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. తమని సొసైటీ సభ్యులుగా నియమించడంలో ముఖ్యపాత్ర వహించిన ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, మీసాల సూర్యచంద్రం, భవిరిశెట్టి సుబ్బారావు, మధ్యాహ్నపు యేసు, ఉపసర్పంచ్ కోరుకొండ లలిత, మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, చిన్నం గంగాధరం, బాల వెంకటరామయ్య, ఉద్దండం హర్ష, కోరుకొండ విగ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో తాగునీటి కొరత లేకుండా చూడాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి

కామవరపుకోట : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు పని ప్రదేశంలో తాగునీటి కొరత లేకుండా అధికారులు చర్య తీసుకోవాలని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉండటంతో ప్రతి గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి, నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్య తీసుకోవాలని అన్నారు. వేసవిలో ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా వారు ఉదయం సమయంలోనే పని ప్రారంభించే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. వారికి మంచినీటి కొరత లేకుండా పంచాయతీ అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశానికి హాజరుకాని వివిధ శాఖల అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.శ్రీదేవి, ఈవోపీఆర్‌డీ ఈ.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు కనికెళ్ల రత్నకుమారి, తమ్మిశెట్టి గిరిజ, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

ట్రైనీ కలెక్టర్ సుడిగాలి పర్యటన



వెదురుతో తయారు చేసిన కళాకృతులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్

బుట్టాయగూడెం : మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ వైటీసీలో గిరిజనులు తయారు చేస్తున్న వెదురు కళాకృతులను పరిశీలించారు. వెదురు కళాకృతుల తయారీకి ముడి సరుకుల వివరాలు, మార్కెటింగ్ విధానాన్ని వెదురు తయారీ మాస్టర్ మారయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేఆర్‌పురంలో బిస్కెట్‌ల తయారీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ బిస్కెట్‌ల తయారీ, మార్కెటింగ్ విధానాన్ని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఆదేవిధంగా వైటీసీలోని జూట్ బ్యాగ్‌ల తయారీ విధానాన్ని కూడా ఆయన పరిశీలించారు. అనంతరం నూతిరామన్నపాలెం పాఠశాలను సందర్శించి అక్కడ భోజనాలను పరిశీలించడం జరిగింది. అలాగే విద్యార్థులతో పాటు ట్రైనీ కలెక్టర్ భోజనం చేశారు. మెనూ సక్రమంగా అమలు జరుగుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కె.బొత్తప్పగూడెంలో జరుగుతున్న కంటి వైద్య శిబిరాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా సందర్శించి అక్కడి పిల్లలు, గర్భవతులు, బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం అమలు తదితర వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో సందర్శించి అక్కడ పొగాకు బేరన్ క్యూరింగ్ విధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పీవీఎస్ నాయుడు, ఐటీడీఏ మేనేజర్ ప్రభాకర్, వైటీసీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్



ద్వారకాతిరుమలలోని యాదవ కాలనీలో మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే తలారి



రామయ్యపేట సచివాలయం పరిధిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



మెట్టగూడెంలో జగనన్న బుక్‌లెట్లతో ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

ద్వారకాతిరుమల : జగన్ అంటేనే నమ్మకమని.. చంద్రబాబు అంటే నయవంచన, నమ్మకద్రోహం, మోసానికి ప్రతిరూపమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమలలోని యాదవ కాలనీలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్, ఎంపీటీసీలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. టీడీపీ హయాంలో చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమానికి, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్నారని వివరించారు. అనంతరం ప్రజల అనుమతితో వారి ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన పలువురు మహిళలు ఎమ్మెల్యే తలారిని ఘనంగా సత్కరించారు. కాలనీలో వాటర్ ట్యాంకును నిర్మించి తమకు మంచినీటి కష్టాలు తొలగించాలని కాలనీవాసులుగా కోరగా అతి త్వరలోనే మంచినీటి ట్యాంకును నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ కుంటం స్వర్ణలత, బొండాడ వెంకన్నబాబు, సచివాలయాల మండల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ(చిన్ని), అంబటి గాంధి, రుద్ర శివాజీ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ములకాల పానకాలు, కంచుం అంజిబాబు, కంచుం రాంబాబు, ములకాల పెద్ద పానకాలు, కంచుం దుర్గారావు, నరదల శ్రీనివాస్, ములకాల సోమయ్య, ములకాల మణిబాబు, అంజిబాబు, గొర్రుముచ్చు సత్యన్నారాయణ, కంచుం సుబ్బారావు, చిలుకూరి చంద్రం, పెద్దిరెడ్డి జ్యోతి, యిమ్మడి నాగు, చిలుకూరి చంద్రం, దూలపల్లి ప్రసాద్, తేలు వెంకటేశ్వరరావు, బొండాడ సాత్యకిరావు తదితరులున్నారు.

జగనన్నే ప్రజల నమ్మకం

లింగపాలెం : ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిపై ప్రజలకు నమ్మకం ఉందని యడవల్లి ఎంపీటీసీ చెలికాని ధర్మారావు(చిట్టియ్య) అన్నారు. మంగళవారం యడవల్లి సచివాలయంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పోలవరం రూరల్ : పోలవరం పంచాయతీ పరిధి రామయ్యపేట సచివాలయం పరిధిలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యామల శ్రీదేవి, కన్వీనర్ సాయి, దత్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే క్రొత్తపట్టిసీమ పంచాయతీలో మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని 13వ వార్డులో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా మోసం చేసిందో వివరించారు. పార్టీ సీనియర్ నాయకులు గూడపాటి రాధాకృష్ణ, 6వ వార్డు కౌన్సిలర్ నేకూరి కిషోర్, ఆర్.శ్రీను, సీహెచ్.రాంబాబు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు .

బుట్టాయగూడెం : మండలంలోని మెట్టగూడెం, కుమ్మరిగట్టు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలంలోని మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు, కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. గృహ యజమానుల సమ్మతితో జగనన్న స్టిక్కర్లను ఇంటి తలుపులకు అతికించారు.

సంక్షేమ పాలనకు బ్రహ్మరథం



కొయిదాలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

వేలేరుపాడు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. వేలేరుపాడు మండలంలో అత్యంత మారుమూల ప్రాంతాలైన కొయిదా, కాచారం, కట్కూరు, టేకూరు, బోళ్లపల్లి, గ్రామాల్లో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ఇండ్లకు స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో ఎంపీపీ వల్లా లక్ష్మీదేవి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, మండల సచివాలయ కన్వీనర్ కొలూరి సత్తిరాజు, పార్టీ నాయకులు కామినేని వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు కట్టి ఉదయ్‌కిరణ్, లక్ష్మణ్, మెట్కు రాంబాబు, చింతపల్లి వీరభద్రం, సత్తిబాబు, సుజాత, కుంజా బొజ్జి తదితరులు పాల్గొన్నారు.

రంగాపురం సొసైటీ చైర్మన్‌గా శ్రీను

లింగపాలెం : రంగాపురం సొసైటీ చైర్మన్‌గా రెడ్డిన శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చైర్మన్‌గా రెడ్డిన శ్రీనుతోపాటు డైరెక్టర్లుగా కట్టా వెంకట రత్తయ్య, బంటు సత్యన్నారాయణ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ప్రసాద్, జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు, కె. గోకవరం సొసైటీ మాజీ చైర్మన్ ఏపూరి సూరిబాబు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహనరావు, ములగలంపాడు సర్పంచ్ ఇనుగంటి రాజేష్‌బాబు పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాపై జరిమానా

కొయ్యలగూడెం : మట్టి అక్రమ రవాణాపై మైనింగ్ శాఖ అధికారులు జరిమానా విధించినట్లు తహసీల్దార్ పాసం నాగమణి మంగళవారం పేర్కొన్నారు. సరిపల్లి, బయ్యనగూడెం గ్రామాల సమీపంలో ఆరు లారీలలో మట్టి అక్రమ రవాణా జరుగుతుండడాన్ని ఏలూరు నుంచి వచ్చిన మైనింగ్ శాఖ అధికారులు గుర్తించారన్నారు. మండల పరిధిలోని సాగునీటి చెరువులో వ్యవసాయ అవసరాలకు అనుమతి పొంది కమర్షియల్ కార్యకలాపాలకు మట్టిని వినియోగిస్తున్నట్లుగా విచారణలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో ఒక్కో లారీకి రూ.8 వేల చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా, ఆకివీడు మండలం, ఐ.భీమవరానికి చెందిన కె.శ్రీనివాసరాజు మంగళవారం రూ. 2 లక్షలు విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేయగా, దాతకు ఆలయ ఏఈఓ కేవీఎల్ఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

25న ఫెర్రీ వేలం

పోలవరం రూరల్ : పోలవరం, పురుషోత్తపట్నం 2023–24 సంవత్సరానికి సంబంధించి ఫెర్రీ వేలం పాట ఈ నెల 25వ తేదీ నాటికి వాయిదా వేసినట్లు ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు తెలిపారు. మంగళవారం జరగాల్సిన ఫెర్రీ వేలంపాటను కలెక్టర్ ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. సదరు టెండర్ కమ్ బహిరంగ వేలంపాటకు సంబంధించిన టెండర్ షెడ్యూల్ 24వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా అందజేయాలన్నారు.

భర్తపై పోలీసులకు ఫిర్యాదు

బుట్టాయగూడెం : ఓ వివాహిత తన భర్తపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. వివరాల ప్రకారం స్థానిక అంబేద్కర్ కాలనీకి చెందిన అందుగుల సునీతను ఆమె భర్త కొంతకాలంగా చెడు అలవాట్లకు బానిసై మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడు. అలాగే వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని భార్య పిల్లలను పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో తన సోదరుడు సురేష్ ఇదే విషయంపై తన భర్తను అడగగా తనను బెదిరించి దౌర్జన్యం చేశాడని సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

రంగాపురానికి చెందిన కోర్సా కనక అనే గిరిజన మహిళ ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. వివరాల ప్రకారం కోరా కనక డ్వాక్రా సంఘాలకు వీఓఏగా పనిచేస్తుంది. డ్వాక్రా సంఘాల గ్రూప్‌లకు బ్యాంక్‌ల నుంచి డబ్బులు అప్పు ఇప్పించేందుకు బ్యాంక్ పత్రాలు రాయించడం తన విధి. అయితే దొరమామిడిలో శ్రీను అనే వ్యక్తి సీజీజీబి అనే మినీబ్యాంక్ నిర్వహిస్తున్నారని డ్వాక్రా సభ్యులు ఆ బ్యాంక్‌లో అప్పులు కడుతున్నారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ బ్యాంకుల్లో మహిళా సంఘాల వారు డబ్బులు కట్టడం మానేశారు. దీనితో బ్యాంక్ నుంచి కమీషన్ ఆగిపోవడంతో శ్రీను అనే వ్యక్తి తన దగ్గర వీడియోలు ఉన్నాయని, వాయిస్ రికార్డ్‌లు ఉన్నాయంటూ వీఓఏలను బెదిరించడమే కాకుండా ఆ వీడియోలను పైఅధికారులకు ఫిర్యాదు చేసి ఉద్యోగాలు తీయిస్తామని బెదిరిస్తూ కులంపేరుతో కూడా దూషిస్తున్నారని కనక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కొట్టి గాయపర్చిన నేరంపై..

జంగారెడ్డిగూడెం : కొట్టి గాయపర్చిన నేరంపై ఇద్దరిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం ఇందిరానగర్ కాలనీలో యడ్లపల్లి కిషోర్ అద్దెకు నివాసం ఉంటున్నారు. అతను ఒక నెల ఇంటి అద్దె బకాయి పడటంతో, ఇంటి యజమాని, అతని కొడుకు యర్రా శేఖర్ అద్దె ఇవ్వమని కిషోర్ ఇంటికి వెళ్లి అతని భార్యతో గొడవపడ్డారు. విషయం తెలిసిన కిషోర్ ఇంటికి వెళ్లగా అద్దె డబ్బులు కట్టమని శేఖర్ కర్రతో దాడి చేశాడు. బాధితుడు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కిషోర్ ఫిర్యాదు మేరకు శేఖర్, అతని తండ్రిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.